నవ్య వీక్లి - పసుపులేటి లక్ష్మినారాయణ స్మృతిసాహితి కథల పోటీలో


## రూ. 2,500 తృతీయ బహుమతి పొందిన కథ

రాజమండ్రిలో రైలు దిగి, అక్కడినుంచి ఎక్స్‌ప్రెస్ బస్సులో రామచంద్రపురం వెళ్ళి బస్టాండులో వెయిట్ చేస్తే రోజుకు మూడు ట్రిప్పులు తిరిగే ఎర్రబస్సు వస్తుంది ఆ ఊరికి వెళ్ళడానికి. ఆ బస్సులో కూర్చుంటే మరో గంట సేపు ప్రయాణం!

అమ్మ ఎప్పుడైనా పుట్టింటికి వెళ్దామంటే నాన్న ఎందుకంతలా విసుక్కునేవాడో మొదటి సారిగా అర్థమైంది నాకు. ఈ రోజుల్లోనే ఇలా వుందంటే అప్పట్లో ఇంకెలా వుండేవో సౌకర్యాలు? నాకు తెలిసీ నేనా ఊరికి నాలుగైదు సార్లు వెళ్ళుంటానేమో... అదీ బాగా చిన్నతనంలో మాత్రమే. ఆ తరువాతెప్పుడూ ఆ ఊరికి వెళ్ళలేదు. అమ్మకి ఆ ఊరినిండా బంధువులే అన్న సంగతి మాత్రం తెలుసు. నా చిన్నతనంలో తన ఊరినుంచి ఏ శుభలేఖ వచ్చినా, శుభకార్యానికి పిలుస్తూ చిన్నకార్డు ముక్క వచ్చినా అమ్మ ఎంతగా సంబరపడిపోయేదో ఇప్పటికీ నాకు బాగా గుర్తే. అలాంటి సందర్భాల్లోనే అమ్మతో ఒకటి రెండుసార్లు ఆ ఊరికి వెళ్లడం గుర్తుంది.

# అమ్మ పుట్టిన ఊరు


ఆకునూరి మురళీకృష్ణ



ఆ తరువాత కొన్నాళ్ళకి పెద్దమావయ్య, చిన్న మావయ్యలు కూడా హైదరాబాద్ వలస వచ్చేయడంతో ఆ ఊరికి వెళ్ళడం దాదాపు తగ్గిపోయింది. ఏ ముఖ్యమైన శుభకార్యాలకో అమ్మ ఒక్కతే పిన్ని వాళ్ళతోనో మావయ్యలతోనే కలిసి వెళ్ళేది. వాళ్ళంతా మరీ బలవంత పెడితే నాన్న కూడా చాలా అరుదుగా వాళ్ళతో బయలుదేరేవాడు.

ఈ మధ్యకాలంలో ఏ ఫంక్షన్లయినా కాకినాడలోనో రాజమండ్రిలోనో ఎక్కువగా హైదరాబాద్‌లోనూ జరుగుతుండడం వల్ల ఆ మాత్రం అవసరం కూడా కలగడం లేదు. ఇదుగో ఇప్పుడు... ఇన్నాళ్ళకి మళ్ళీ ఆ ఊరికి వెళ్ళాల్సిన అవసరం పడింది. అసలా పనికి ప్రత్యేకంగా పనిగట్టుకుని మేము రానక్కర్లేదు. కానీ అమ్మ పట్టుబట్టడం వల్ల బయలుదేరాల్సి వచ్చింది.

నాన్న మీద కోపంతో ప్రయాణంలో దారిపొడవునా నాతో ముభావంగా వున్న అమ్మ రామచంద్రపురంలో బస్సు దిగగానే మొదటిసారిగా నోరు విప్పింది. కళ్ళింతలు చేసుకుని చూస్తూ చుట్టూ వున్న పరిసరాలని గమనిస్తూ ''రాంపురవేనా ఇది? ఎంతగా మారిపోయింది?!'' అంది.



ఆశ్చర్యమో ఆనందమో తెలియని నవ్వుతో అమ్మ ముఖం వెలుగుతోంది. ఆ ఊరి పేరుని ఆమె పలికిన తీరుకి నవ్వొచ్చింది నాకు.

''నువ్వు చూసి దశాబ్దం పైనే అవుతోంది. మారదా మరి ఊరు?'' అన్నాను నవ్వుతూ.

''ఇక్కడ బస్సుకోసం ఏం వెయిట్ చేస్తాం? టాక్సీ ఏమైనా దొరకుతుందేమో చూస్తాను'' అన్నాను అక్కడినుంచి బయటికి కదలబోతూ.

''నీకూ మీ నాన్నకీ షోకులకేం తక్కువలేదు. గంట గంటకీ బస్సుందని శంకరం మావయ్య చెప్పాడు. టాక్సీఎందుకూ? అసలు నువ్వొద్దన్నావు గానీ, శంకరం మావయ్య రాజమండ్రి స్టేషనుకే వస్తానన్నాడు...'' అంది అమ్మ. శంకరం మావయ్య అమ్మకి కజిన్ బ్రదర్.

''అంత అవసరమేముందమ్మా? ఇక్కడినుంచి మనకేదో ఒక వెహికల్ దొరక్కపోదు. అయినా నీకు తెలియని ఊరా ఏమిటి?'' అన్నాను. ఆఖరి మాటలు ఆమె మీద బాగా పనిచేసాయి.

''అవునవును....'' అంది. ''ఇక్కడి నుంచి మా ఊరికి జట్కా బళ్ళు వెళతాయి. బస్సు కోసం చూసే ఓపిక లేకపోతే దాంట్లో వెళ్ళిపోదాం''.

నేను మళ్ళీ నవ్వాను. ఆలోగా ఒకరిద్దరు ఆటోడ్రైవర్లు వాళ్ళ దగ్గరికి వచ్చి 'ఏ ఊరెళ్ళాలండీ?' అని అడిగారు. నేను ఆటో మాట్లాడుతుంటే ఆశ్చర్యంగా చూసింది అమ్మ. లగేజ్ ఆటోలో వుంచాము.

''ఇప్పుడు ఇక్కడికి కూడా ఆటోలు వచ్చేసాయిరా? మీ చిన్నతనంలో బస్సులూ జట్కాలూ తప్ప మరేం వుండేవి కావు. మనం వస్తున్నామంటే మీ తాతయ్య రాంచంద్రపురానికి బండి పంపేవారు...'' ఆటోలోంచి బయట పరిసరాలని పరికించి చూస్తూ అంది అమ్మ ఆ రోజులని గుర్తు తెచ్చుకుంటూ. ''ఆ బండిలో వెళ్ళాలంటే మీ నాన్నగారు విసుక్కునేవారు గానీ పిల్లలు మీరంతా బాగా సంబరపడేవారు ఆ ప్రయాణానికి''.

నాకు ఆ ఎడ్లబండి ప్రయాణం లీలగా గుర్తుంది.

ఆటో మెయిన్‌రోడ్డు వదిలి సెంటరు దగ్గర మలుపు తిరిగి పక్కనున్న వేరేదారిలోకి వచ్చింది. సెంటరు దగ్గర పుస్తకాలు పట్టుకుని నిల్చున్న కొంతమంది కాలేజి పిల్లలు బస్సు కోసం కాబోలు ఎదురు చూస్తున్నారు. పచ్చగా మెరుస్తున్న పంట పొలాల మధ్య గీత గీసినట్టున్న సన్నని తార్రోడ్డు మీద ఆటో నెమ్మదిగా సాగిపోతోంది. అస్తమిస్తున్న సూర్యుడు ఆకాశంలో ఎర్రటి బంతిలా వున్నాడు.

అప్పుడప్పుడే పసుపు రంగులోకి మారుతున్న పచ్చని వరిపొలాల మీద సింధూరం రంగు సూర్యకాంతి పడుతూ వింతగా పరావర్తనం చెందుతోంది. అలాంటి దృశ్యాలని కంప్యూటర్ స్క్రీన్ సేవర్ల మీదే తప్ప వాస్తవంగా ఎప్పుడూ చూడని నేను కళ్ళప్పగించి చూస్తున్నాను.

పొలాల మీదనుంచి వచ్చేగాలి చల్లగా వుంది. దారి పొడవునా ఏవేవో చిన్నచిన్న ఊళ్ళు వస్తూనే వున్నాయి. ప్రతి ఊరినీ పేరుపేరునా చెబుతూ ఆ ఊళ్ళో తనకి తెలిసిన వాళ్ళు ఎవరెవరున్నారో చెబుతోంది అమ్మ. ఆటోలోంచి దాదాపు ముఖం బయటపెట్టి ఆనందంగా ఆ ఊళ్ళని చూస్తూ, ఆశ్చర్యపోతూ తనకి గుర్తున్న ఆనాటి ఆనవాళ్ళని వెదుక్కుంటూ వాటిని గుర్తుపట్టి ''అదిగో కోమటి చెరువు... అదిగో శివాలయం...'' అంటూ చూస్తూ మళ్ళీ ఆశ్చర్యపోతూ కనీసం నేను వింటున్నానో లేదో కూడా గమనించకుండా జ్ఞాపకాల పుటలని తడుముకుంటున్నట్టు మాట్లాడుతున్న ఆమెని చూస్తే నాకు ఆశ్చర్యమనిపించింది.

ఎక్కడా ఆగకుండా రావడం వల్ల నలభై నిమిషాల్లోనే ఆ ఊరికి చేరుకోగలిగాం. ''అప్పుడే వచ్చేసామా?'' అంటూ ఆశ్చర్యపోయింది అమ్మ ఊరిని దూరం నుంచి చూస్తూనే. ఊరి మొదట్లో కాలవ గట్టున వున్న విష్ణాలయం దగ్గర ఆటో ఆపించుకుని మండపం మీదకి ఎక్కి మూసి వున్న గర్భగుడి తలుపుల ముందర నిలబడి నమస్కరించింది.

తిరిగి వస్తుంటే కాలవలోంచి నీళ్ళు తీసుకుని వెళ్తున్న ఒకరిద్దరు అమ్మలక్కలు అమ్మని గుర్తుపట్టి పలకరించారు ''జానకమ్మవి కదూ?'' అంటూ. అమ్మ కూడా వాళ్ళని గుర్తు పట్టి. ''ఎంత మారిపోయారు?'' అంటూ ఆశ్చర్యపోయి పలకరించింది. పది నిమిషాల తరువాత ''శంకరం ఇంట్లో దిగుతున్నాను. సాయంత్రం ఒకసారి రండి'' అంటూ చెప్పి ఆటో ఎక్కి కూర్చుంది.

అమ్మ మళ్ళీ ముభావంగా అయిపోయింది. ''ఇన్నాళ్ళకి మనఊరు గుర్తొచ్చి వచ్చావామ్మా? అని అడుగుతున్నారు వాళ్ళు. ఇకముందు ఈ మాత్రం కూడా గుర్తు రాకూడదనే మా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారమ్మా అని చెబితే వాళ్ళేమనుకుంటారు? నేను చెప్పకపోయినా రేపొద్దున్న ఈ విషయం అందరికీ తెలుస్తుంది. నలుగురూ నా గురించి ఏమనుకుంటారు? మీ నాన్నగారికి ఆ మాత్రం ఆలోచన కూడా లేదు'' అణుచుకోలేనట్లుగా అంది కాసేపటికి. ఆటో అతనికి వినిపించకుండా జాగ్రత్త పడుతూ నెమ్మదిగా

# పుట్టింటి నిధి



అక్షరాలతో పాటూ మాకు సాహిత్యం మీద అనురక్తిని కూడా నేర్పిన మా అమ్మగారు శ్రీమతి ఆకునూరి సూర్యకుమారి. మేము ముగ్గురం పిల్లలం. చిన్నప్పుడు స్కూళ్లకి సెలవులిచ్చినప్పుడల్లా అమ్మతో కలిసి అమ్మమ్మగారింటికి వెళ్లడం అందరిలాగే ఒక అందమైన జ్ఞాపకం మాకు. అత్తారింటికి వెళ్ళిన ప్రతి ఆడపిల్లకి పుట్టింటి తాలూకు జ్ఞాపకాలూ, స్నేహాలూ హృదయంలో మరొక ఎత్తు నిక్షిప్తమైన నిధిలా ఉంటాయి. అవన్నీ ఒక ఎత్తయితే పుట్టి పెరిగిన ఊరిమీద వుండే అభిమానం మరొక ఎత్తు. ఎవరున్నా లేకపోయినా ఆ ఊరు పొలిమేరల్లో అడుగు పెడుతుంటే కన్నతల్లి ఆప్యాయంగా చేతులు సాచి ఆహ్వానిస్తున్నట్టే వుంటుంది. అయితే ఈ రోజుల్లో ఆడ పిల్లలే కాదు, మగ పిల్లలు కూడా వున్న వూరిని వదిలి వలసపోవడం తప్పనిసరై పోతోంది.

అపురూపమైన స్నేహాలని సైతం 'నెమరు వేసుకోవడం' తప్ప కొనసాగించడం అసాధ్యమై పోతున్న ఈ వేగవంతమైన యాంత్రిక జీవితంలో పుట్టి పెరిగిన ఊరిని చూడకుండా చాలాకాలమే వుంటున్నాం. ఆ భావాలకి కొంత నాటకీయత జోడించి రాసిన కథే 'అమ్మ పుట్టిన ఊరు'.

**-ఆకునూరి మురళీ కృష్ణ**
**907, నాగార్జునా అపార్ట్‌మెంట్స్,**
**వెంకటరమణా కాలనీ మెయిన్ రోడ్,**
**అశోక్ నగర్, కర్నూలు.**
**సెల్ : 9848174957**

అన్నదేగానీ ఆ కంఠంలోని తీవ్రతని నేను గుర్తించలేక పోలేదు. నాకు తెలిసీ అమ్మ నాన్నని ఏ విషయంలోనూ ఇంతలా వ్యతిరేకించలేదు.

"ఏమనుకుంటారు? అయినా మన నిర్ణయాల్లో ఎవరో తెలియని వాళ్ళ జోక్యం ఏమిటి? నువ్వు అనవసరంగా ఫీలవుతున్నావుగానీ మనం ఈ రోజు చేస్తున్న పని మీ అన్నయ్యలు ఇరవైయేళ్ళ క్రితమే చేసారు. అప్పుడు వీళ్ళంతా ఏమనుకున్నారు? ఏమన్నారు?" అన్న నాన్న మాటలు గుర్తుకు వచ్చాయి. అవే మాటలని అమ్మకి అర్థమయ్యేలా చెప్పి చాలా సులువుగా అమ్మని ఒప్పించగలను. కానీ ఆ క్షణంలో అమ్మ ముఖం చూస్తే నాకు అలా మాట్లాడబుద్ధి కాలేదు.

ఊరి మొదట్లో రావిచెట్టు క్రిందున్న పెద్ద సిమెంటు దిమ్మ మీద కూర్చున్న వాళ్ళు, దారి వెంట నడుస్తున్న వాళ్ళు, పనులు, మాటలూ ఆపేసి మరీ, ఊళ్ళోకి వస్తున్న మా ఆటోనొకసారి పరికించి చూస్తున్నారు. అమ్మ ఆటో డ్రైవర్‌కి దారిచూపిస్తూ డైరెక్షన్స్ ఇస్తోంది.

ఆటో శంకరం మావయ్య ఇంటిముందు ఆగింది. మావయ్య కుటుంబం మొత్తం బయటికి వచ్చేసారు ఆటో ఆగిన శబ్దానికి. ఒకళ్ళు మా చేతుల్లోని లగేజ్ అందుకున్నారు. మరొకరు మా ప్రమేయం లేకుండానే ఆటో అతనికి డబ్బులిచ్చి, తాగడానికి మంచి నీళ్ళిచ్చి పంపేసారు. "రండ్రండి... ప్రయాణం బాగా జరిగిందా. బస్సులు టైముకి దొరికాయా?" "వీడు చాలా మారిపోయాడొదినా... ఇంతుండేటప్పుడు చూసాం ఇంతలోనే ఎంత ఎదిగిపోయాడు?" అంటూ గలగలా పలకరింపులు.

ఎన్నో సంవత్సరాల తరువాత వచ్చినా అమ్మ ఎంతో అలవాటున్నదానిలా వసారాకి ఎడం పక్కకి వెళ్ళి అక్కడ మందారచెట్టు పక్కన గోలెంలో వున్న నీటితో కాళ్ళూ చేతులూ కడుక్కుని అందరినీ పలకరిస్తూ వాళ్ళతోపాటు లోపలికి వెళ్ళింది. "రంగన్నా... అబ్బాయిగారికి కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళియ్యరా" అన్నాడు శంకరం మావయ్య నిలబడ్డ నన్ను చూస్తూ.

గోలెంలోంచి చల్లని నీటిని అల్యూమినియం డొక్కుతో అందించి నేను షూ విప్పి కాళ్ళు కడుక్కుంటుంటే రాములవారి పాదాలకేసి చూస్తున్నట్టు నా కాళ్ళనే చూస్తూ తువ్వాలందిస్తూ అన్నాడు రంగన్న "మిమ్మల్ని చిన్నప్పుడంతా ఈ చేతులతోనే ఎత్తుకుని ఆడించేవారమండీ.... ఇన్నాళ్ళకి వచ్చారు మళ్ళీ మా ఊరికి. ఇప్పుడు మిమ్మల్ని చూస్తుంటే అచ్చం మా పెద్దకరణంగారిలా అనిపిస్తున్నారు" అంటూ కళ్ళొత్తుకున్నాడు. పెద్ద కరణం గారంటే మా తాతగారని (అమ్మ వాళ్ళ నాన్న) నాకు అర్థమైంది.

నేను తువ్వాలందుకుంటూ నవ్వేను. తలుపు చాటునుంచి శంకరం మావయ్య పిల్లలు నన్నే చూస్తున్నారు. నేనటు చూసేసరికి పారిపోయారు. నేను మావయ్య వెంట లోపలికి నడిచాను. అమ్మ అప్పటికే అందరితోనూ కబుర్లలో పడింది. ఇల్లూ పెరడూ అంతా కలియ తిరుగుతూ తన చిన్ననాటి ముచ్చట్లని నెమరు వేసుకుంటోంది. అత్తయ్యనీ మావయ్యనీ ఎవరెవరి పేర్లో చెబుతూ కుశలం అడుగుతోంది.

"మా మేనల్లుడు అచ్చు సినిమా హీరోలా వున్నాడొదినా... మా పిల్లలే కనుక పెద్దాళ్ళయి వుంటే మేమసలు వదిలే వాళ్ళం కాదు" అంటూ హాస్యాలాడారు అత్తయ్యా, ఆమె తోడి కోడళ్ళూ అమ్మతో నేను వింటుండగానే.

అమ్మ వస్తోందని తెలిసి ఊళ్ళో వున్న దగ్గరి బంధువులంతా అక్కడ చేరారు. మరికొంతమంది పనులు ముగించుకుని వస్తామని అత్తయ్యతో చెప్పారంట. అందరూ వస్తారని అనుకుని వున్న పెద్ద వంట గదిలో కూర్చుని కబుర్లలో పడ్డారు. నేను వసారాలో వున్న ఉయ్యాల బల్ల మీద కూర్చుని తెలుగు పేపరు తిరగేస్తున్నాను.

వాళ్ళ కబుర్లు తెమిలేటట్టు లేవు. తెలుగు పేపరు నాకు ఏ మూలకీ సరిపోవడం లేదు. మధ్యలో ఒకసారి వచ్చి 'కాఫీ త్రాగుతావా?' 'పోనీ స్నానం చేసి కాసేపు రెస్టు తీసుకో' లాంటి రొటీన్ మాటలు నాతో అనేసి మళ్ళీ అమ్మతో కబుర్లలో పడిపోతున్నారు వాళ్ళంతా. అమ్మ ఎప్పుడూ నవ్వుతూనే వుంటుంది గానీ అప్పుడు వాళ్ళతో మాట్లాడు తున్నప్పుడు కనిపిస్తున్న అలాంటి ఉత్సాహాన్ని అమ్మలో అంతకుముందు నేనెప్పుడూ చూడలేదు. నాకు బాగా తెలిసిన అమ్మే నాకళ్ళకి చాలా కొత్తగా కనిపిస్తోంది! 'అమ్మకిక్కడ ఇంత ఫాలోయింగ్ వుందా?' అని నాకే ఆశ్చర్యంగా అనిపించింది.

ఏం తోచక నేను తలుపు సందుల్లోంచి చూస్తున్న పిల్లలని దగ్గరికి పిలిచి వాళ్ళకి మేము తెచ్చిన చాక్లెట్లు, బిస్కెట్లు ఇచ్చి మాటలు కలిపాను. అదిచూసి అప్పటిదాకా మొహమాటంగా నన్నంటి పెట్టుకుని కూర్చున్న ఒకళ్ళిద్దరు పెద్దవాళ్ళు కూడా చల్లగా లోనికి జారుకుని అమ్మతో కబుర్లలో పడిపోయారు. వాళ్ళ కబుర్లు నాకు నెమ్మదిగా వినిపిస్తూనే వున్నాయి. అరమరికలు లేని గొప్పగొప్ప స్నేహితులు నాకు మాత్రమే వున్నారని నేననుకుంటూ వుంటాను. వాళ్ళంతా అమ్మకి అలాంటి స్నేహితులే అని వాళ్ళ మాటల ద్వారా అర్థమౌతూంటే నాకు ఆశ్చర్యంగా అనిపించింది.

***

చీకటి పడేసరికి అంతా ఎవరిళ్ళకి వాళ్ళూ బయలుదేరారు. శంకరం మావయ్య భార్య వాళ్ళని కూడా భోజనాలకి అక్కడే వుండిపోమని బలవంతం చేసింది. వాళ్ళు "ప్రయాణం చేసి వచ్చింది కదా? జానకిని స్నానం చేసి కాసేపు రెస్టు తీసుకోనీ... భోజనాలయ్యాక మళ్ళీవస్తాం తీరికగా కబుర్లు చెప్పుకుందాం" అంటూ లేచి వెళ్ళి పోయారు.

స్నానం చేసి కాటన్ చీర కట్టుకుని వచ్చిన అత్తయ్యకి వంటలో సాయం చేస్తున్న అమ్మ దగ్గరికి వచ్చి మెల్లగా అన్నాడు శంకరం మావయ్య. "బావ చెప్పినట్లే ఊర్లో నలుగురి తోనూ ఓ మాట చెప్పి వుంచాను. పొలం కొంటామని చాలా మందే వచ్చారు కానీ మన బంధువుల్లోనే కొందరు బయటి వాళ్ళకి అమ్మడం ఎందుకూ ఆ రేటు మేమే ఇస్తాం మాకే ఇమ్మను అంటున్నారు. నువ్వెలాగంటే అలాగ. దగ్గరి వాళ్ళకి వద్దనుకుంటే బయటి వాళ్ళనే పిలిపిస్తాను..."

"అదేం లేదు శంకరం... ఎవరికైనా మాకేం అభ్యంతరం లేదు... రేటు గురించి కూడా పెద్ద పట్టింపేం లేదు. మాకేం లేదా పోదా? ఆయన ఉద్దేశం కూడా పొలాన్నమ్ముకుని డబ్బు చేసుకుందామని కాదు... పెద్దవాళ్ళమౌతున్నాం కదా అన్నీ సెటిల్ చేసుకుంటే మంచిదని అమ్మేద్దామన్నారు..."

వంట గదిలోంచి వినిపిస్తున్న అమ్మ మాటలు వింటుంటే ఆశ్చర్యంగా అనిపించింది. నాన్న ఉద్దేశాన్ని అంత కరెక్టుగా అర్థం చేసుకున్న మనిషి మరి పొలాన్ని అమ్మొద్దా మన్నందుకు నాన్నతో వారం రోజులుగా ఎందుకంతలా పోట్లాడిందో మౌనపోరాటం ఎందుకు చేసిందో నాకు పజిల్‌గా అనిపించింది. చివరికి నాన్న మాటని కాదనలేక అయిష్టంగానే బయలుదేరింది.

"ఆ సంగతి నాకూ తెలుసక్కా..... కానీ ఈ పొలమేనా వుంచుకుంటే ఈ ఊరితో మీకు ఆ మాత్రం సంబంధమేనా వుంటుందని అనుకున్నాను" అన్నాడు మావయ్య. ఆ మాటల ద్వారా అమ్మ అంతరంగం కొంచెం కొంచెం అర్థమవసాగింది.

"అది సరేగానీ శంకరం, జగన్నాథం మాస్టార్నొకసారి చూడాలిరా... మళ్ళీ ఎప్పుడొస్తానో ఏమిటో?" అంది అమ్మ మాట మారుస్తూ.

"దానిదేముంది? వెళ్దువుగానిలే ... ఆయనకూడా బాగా పెద్దాయనైపోయారు. బయటికి రావడం

లేదు. అస్తమానూ నీ గురించి ఆడుగుతుంటారు. నిన్ను చూస్తే సంతోషిస్తారు'' అన్నాడు మావయ్య.

''అవున్రా... వచ్చిన దగ్గర నుంచీ చూస్తున్నాను విశ్వనాథం కనబడలేదేం? ఎలా వున్నాడు?'' హఠాత్తుగా అంది అమ్మ.

మావయ్య దీర్ఘంగా నిట్టూర్చడం వినిపించింది. ''ఎలా వుంటాడు? అలాగే వున్నాడు. ఆ పాడు తాగుడికి ఇల్లూ వళ్లూ గుల్లై పోయింది. ఇంట్లో వాళ్ళకి తినడానికి తిండి లేదు... కట్టుకోవడానికి బట్టలేదు... ఆ పెళ్ళానికి పిల్లలకి అభిమానం జాస్తి. ఒకరి ముందు చేయి చాపడం ఇష్టం లేక అలాగే పస్తులుంటూ నెట్టుకొస్తున్నారు'' అన్నాడు.

''నేను వస్తున్నట్టుగా చెప్పావా?'' అంది అమ్మ.

''మధ్యాహ్నమే రోడ్డు మీద కనిపిస్తే చెప్పాను. మనిషి అదేస్థితిలో వున్నాడు. నీ ముందుకి అలా రాలేక రాలేదనుకుంటాను. లేకపోతే వచ్చేవాడే'' అన్నాడు మావయ్య. అమ్మ మౌనంగా వుండిపోయింది.

''విశ్వనాథం అంటే ఎవరు?'' కుతూహలంగా అడిగాను నేను భోజనాలు చేస్తుంటే ఆయన ప్రసక్తి మళ్ళీ రావడంతో.

''మీ అమ్మా తనూ ఒకే క్లాసు చదివే వాళ్ళు... ఇద్దరూ స్కూలుకి కలిసి వెళ్ళేవారు. మాకు దూరపు బంధువు. మీ అమ్మకి వరుసకి అన్నయ్య అవుతాడు. కానీ బంధుత్వం కన్నా స్నేహమే ఎక్కువ వాళ్ళిద్దరికీ. ఒకరంటే ఒకరూ ప్రాణంగా వుండేవారు'' అన్నాడు మావయ్య.

''రేపు నేను పెందలాడే బయలుదేరి విశ్వనాథం ఇంటికి వెళ్తానురా శంకరం... లేటయితే వాడు మళ్ళీ ఎటో వెళ్ళిపోతాడేమో'' అంది అమ్మ కొంచెం దిగులుగా.

''సరే... మా పెద్దదాన్ని తీసుకుని వెళ్ళు'' అన్నాడు మావయ్య.

మా భోజనాలయి కాసేపు విశ్రాంతి తీసుకోగానే మళ్ళీ అమ్మ గ్యాంగ్ అంతా వచ్చేసింది. ఆరుబయట పెరట్లో మంచాలు పక్కలూ వేసుకుని మళ్ళీ కబుర్లు మొదలు... నేనుంటే వాళ్ళ స్వేచ్ఛకి అడ్డుగా వుంటానని పించి నాకు నిద్ర వస్తోందంటూ లోపల గదిలోకి వచ్చేసి పడుకున్నాను. వాళ్ళ మాటలు నెమ్మదిగా వినిపిస్తూనే వున్నాయి. మధ్య మధ్యలో అమ్మ విశ్వనాథం గురించి అడగడం కూడా వినిపిస్తూనే ఉంది నాకు!

***

మర్నాడు ఉదయానే అమ్మ తెమిలి బయలుదేరబోతుంటే ''ఎక్కడికీ? విశ్వనాథం గారింటికేనా? నేనూ వస్తాను'' అన్నాను. అమ్మ చిన్ననాటి ప్రాణ స్నేహితుడిని చూడా లని నాకూ అనిపించింది.

''సరే.... పద...'' అంది. అంతకుముందు రోజు వున్న ఆనందం ఉద్వేగం ఇప్పుడామెలో కనిపించడం లేదు. ఖంగారుగా, భయంగా వుంది. చాలా కొత్తగా వుంది నాకు అమ్మని అలా చూస్తుంటే. దారిలో ఒక్క మాట మాట్లాడకుండా ఏదో ఆలోచిస్తూనే వుంది అమ్మ.

పాతకాలం నాటి పెంకుటిల్లు అది... పైన చాలా మటుకు పెంకులు ఊడిపోయి ఆ ఖాళీల్లోంచి వెలుతురు లోపలికి పడుతోంది. గోడలన్నీ బాగా మాసిపోయి, పెచ్చులూడి పోయి లోపల ఎర్రమట్టి కనిపిస్తున్నాయి. మమ్మల్ని చూసి ఆ ఇంట్లోని వాళ్ళు సంతోషించడం కన్నా ఎక్కువ ఖంగారు పడినట్లుగా కనిపించారు. వాళ్ళ 'లేమి'ని మేమెక్కడ గుర్తించి బాధపడతామేమోనన్న ఖంగారు...

గుమ్మంలోనే మాకు ఎదురు వచ్చాడు విశ్వనాథం మావయ్య. తలారా స్నానం చేసి నుదుట్న విభూది రేకలతో కనిపించాడు. అమ్మనిచూసి ఖంగుతిన్నట్టుగా అయి సర్దుకుని నవ్వాడు.

''శంకరం చెప్పాడు నువ్వొస్తున్నావని. రాత్రి లేటయింది... పనుండి... ఇదుగో ఇప్పుడు నీ దగ్గరకే వస్తున్నాను... ఈలోగా నువ్వే వచ్చేసావు'' అన్నాడు.

అన్నాళ్ళ తరువాత కలిసిన స్నేహితుడితో అమ్మ ఒక్క మాట కూడా మాట్లాడ లేదు. అతడివంకే తినేసేలా చురుగ్గా ఒకసారి చూసి చూపు తిప్పుకుంది. అతడి భార్యని పలకరించింది. కూతుళ్ళిద్దరినీ పిలిచి ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంది. ఆయన గిలగిల్లాడుతున్నట్టుగా చూసాడు అమ్మ వంక.


''మీ అబ్బాయా? చాలా పెద్దాడైపోయాడు... ఈ మధ్య చూడలేదు కదా?'' అంటూ అమ్మతో మామూలుగా మాట్లాడడానికి ఆయన చేస్తున్న ప్రయత్నాలు చూస్తుంటే నాకు జాలి వేసింది.

ఆవిడ కాఫీ కలపడానికి వంటింట్లోకి వెళ్ళింది. వెనుకే పెద్ద కూతురు కూడా వెళ్ళింది. నేను నెమ్మదిగా అక్కడినుంచి లేచి పెరట్లోకి వచ్చాను.

''స్నానం చేసి విబూది రాసుకుంటే నేను గుర్తుపట్టలేననుకున్నావా? నువ్వు మారవా?'' అమ్మ గొంతు నెమ్మదిగా తీక్షణంగా అనడం వినిపించింది

## మనమీదేనత్రోయ్...

సత్తిరి..



## కొరకంచు

ఆడపిల్లంటే
కేవలం శరీరం మాత్రమే కాదనీ
అనుభూతులు నింపుకునే హృదయం ఉన్నదనీ
ఆలోచనలు మొలకలెత్తే మెదడున్నదని
ఆశలు నిండిన మనసు ఉన్నదనీ
అక్షరాలు పండించిన మహానుభావుల
శతజయంతోత్సవాల్ని
ఊరూరా సాహిత్యవేదికల్ని వెలిగిస్తూ
వాడవాడా స్మృతి గీతికల్ని ఆలపిస్తూ జరుపుకుంటున్న వాళ్ళం
ఆ గాలి సోకి వికసితులైన వాళ్ళం
ఆ అక్షర పరిమళాన్ని ఆర్తిగా అద్దుకున్న వాళ్ళం
మనమే కాక ఎందరో ఇంకెందరో!
అయితేనేం



ఈనాటికీ ఆడది అంటే అవయవ సంపదే
మగపిల్లల్లైనా ఆడపిల్లల్లైనా
నవమాసాలూ మోసి
కంటున్న వాళ్లం మనమే అయినా
లేలేత హృదయాలలో విషబీజాలు నాటి
పెంచుతున్నది మాత్రం సమాజమే
ఆవరణమంతటా నిండిపోయిన కాలుష్య సంస్కృతే
పసితనం వీడక ముందే
మన అడ్డాల్లోంచి జారిపోతున్నారు
బళ్ళో అక్షరాలు దిద్దక ముందే
నట్టింట్లో తిష్టవేసిన టీవీలు పాఠాలు నేర్పిస్తుంటే
సినీమాలు పండితుల్ని చేసేస్తున్నాయ్
మూతిమీద మీసాలకన్నా ముందే
రాక్షసత్వం ఒళ్లంతా అడవిలా అల్లుకుపోతోంది!
అందుకే మరి
ఆడదంటే విలాసవస్తువుగానో
ప్రేమంటే కామంగానో
కాదంటే ప్రాణాలు తీయడంగానో
వాళ్ల డిక్షనరీలో నమోదైపోయింది
కార్యకారణాలు వెతుక్కునే లోపునే
మనచుట్టూ వేనవేల ప్రశ్నలు వీరంగం చేస్తున్నాయ్
కన్నందుకు మనదా?
ఆ రకంగా మలుస్తోన్న సమాజానిదా?
దానవత్వాన్ని పెంచి పోషిస్తోన్న నేటి వెండి తెరదా?
తప్పు ఎవరిదైతేనేం
ముల్లు ఏదయితేనేం
అపుడూ ఇపుడూ ఎపుడూ అరిటాకు మాత్రం అచ్చంగా ఆడపిల్ల కావల్సిందేనా?
కానే కాదు
కన్నందుకూ కాదు
ఆడవాళ్ళమైనందుకు
కుంపట్లు రాజేసుకుంటూ కూచోడం కాదు
సమాజాన్ని రగుల్కొల్పేందుకు
నిజానికి అందులో సగమైన మనం
మన ఆడపిల్లల్ని కొరకంచుల్లా తయారు చేయడం కోసం
కాలుష్య సంస్కృతిని ఎలా కాల్చాలో
అక్షరాల్లోనైనా
అస్తిత్వ పోరాటాల్లోనైనా
ఆమ్ల సముద్రాల్ని సైతం ఎదురీదేలా
ఆలోచనల్ని ఎగసన తోద్దాం
కాస్తంత కలం అందించండి

– శీలా సుభద్రాదేవి

నాకు లోపలినుంచి. అలా వాళ్ళిద్దరి మధ్యా మౌనం ముక్కలై క్రమంగా మాటలు మామూలయ్యాయి.

నేను లోనికి వెళ్ళేసరికి విశ్వనాథం మావయ్య ముఖం తేటగా వుంది. అమ్మచేత తినాల్సిన తిట్లన్నీ తినేసినందుకు రిలీఫ్‌గా వుందేమో.... హుషారుగా, బెరుకులేకుండా అమ్మతో మాట్లాడుతున్నాడు. అమ్మ ముఖంలో మాత్రం దిగులు... ఆ ఇంటినీ, పిల్లలనీ చూస్తుంటే.

బయలుదేరేముందు అమ్మ మేమెవరమూ చూడకుండా విశ్వనాథం మావయ్యతో చేతిలో చేయి వేయించుకుని రహస్యంగా ఏదో వాగ్దానం తీసుకోవడం కనిపించింది.

''ఆడపడుచు రాక రాక ఇంటికి వస్తే ఏమీ పెట్టలేకపోతున్నాను'' అమ్మకి బొట్టు పెడుతూ పెరట్లో పూసిన మందారపూలని చేతిలో వుంచుతూ అంది అత్తయ్య బాధగా.

బయటికి వస్తుంటే అమ్మ కళ్ళనీళ్ళని ఆపుకోలేక పోవడం స్పష్టంగా కనిపించింది... నాకు చాలా విచిత్రంగా వుంది ఇదంతా... మేము తప్ప మరే లోకమూ వుండదన్నట్టుగానే కనిపించే అమ్మలో నాకు తెలియని కొత్త కోణాన్ని చూస్తున్నట్టుగా అనిపిస్తోంది నాకు. అమ్మ వంక చూస్తూనే ఆలోచనలో పడ్డాను.

***

''శంకరం మావయ్య పిలుస్తున్నాడు... నీతో మాట్లాడాలంట'' అంది అమ్మ.

నేను అమ్మ చేయి పట్టుకుని ఆపాను. ''పొలం బేరం సంగతి మాట్లాడ్డానికేనా? వద్దు. నేను చెప్పేది విను... పొలం మనం అమ్మద్దు... మీ స్నేహితుడు విశ్వనాథం మావయ్యకి కౌలుకి ఇద్దాం'' అన్నాను.

అమ్మ ఆశ్చర్యంగా చూసింది నా మాటలకి.

''అవును... నిన్న వాళ్ళ పరిస్థితి కళ్ళారా చూసాము కదా? చూడబోతే ఆయనకి చేయ డానికి పనేం లేనట్లుంది. ఎంత నీకు మాటిచ్చినా నాలుగు రోజులు గడిచేసరికి పనేం లేక ఆయన మామూలు దారిలోనే నడుస్తాడు. అతడు మారాలంటే ఏదో ఒక పని కల్పించాలి. కౌలుడబ్బులు మనకేం ఇవ్వనక్కర్లేదు. పొలాన్ని పండించుకుని ఆ కుటుంబం మూడుపూటలా కడుపునిండా తిని, పిల్లలకి చక్కగా చదువులు చెప్పించుకుంటే చాలని చెబుదాం. అతడిని మార్చాలని ఎన్నో ప్రయత్నాలు చేసావు. ఈ చివరి ప్రయత్నం కూడా చేద్దాం''.

అమ్మ నా వంక ఆశ్చర్యంగా చూసింది. ''మరి మీ నాన్నగారికేం చెబుదాం?'' అంది.

నేను అమ్మ వంక జాలీ నవ్వూ కలిసిన చూపు చూసాను. ''ఆ పొలం నీ ఆస్థి. దాన్ని నువ్వేం చేసుకున్నా ఎవరికీ సంజాయిషీ ఇవ్వక్కర్లేదు'' అందామనుకున్నాను. కానీ ఆ మాటలతో అమ్మ కన్విన్స్ కాదని నాకు తెలుసు...

''అది నేను చూసుకుంటానులే. నాన్నని కన్విన్స్ చేసి మనం చేసిన పని కరెక్టేనని అనిపిస్తాను గానీ, నువ్వు మీ ఫ్రెండుని పిలిచి మాట్లాడు!'' అన్నాను.

నా భరోసాతో అమ్మ విశ్వనాథం మావయ్యకి కబురు చేసింది. నేను చేసిన ఆ పనికి అమ్మ తరపు బంధువులంతా నన్ను ఎంతో మెచ్చుకున్నారు. ''పొలం అమ్మేస్తే నువ్వింక ఈ ఊరికి అసలు రావేమోనని భయపడ్డాం జానకీ... ఇప్పుడా బాధలేదు. విశ్వనాథం దగ్గర నుంచి కౌలు డబ్బులు ముక్కుపిండి వసూలు చేయడానికి నువ్వు తప్పకుండా రావలసిందే. కనీసం నువ్వొస్తావన్న ఆశైనా వుంటుంది మాకు'' అన్నారు నవ్వుతూ.

అమ్మ కళ్ళలో కూడా అదే భావం కనిపించింది. నా వంక కృతజ్ఞతగా చూసింది.

నాకు గిల్టీగా అనిపించింది. పరీక్షల సమయంలో అమ్మ లేకపోతే చదువుకోలేనని, సెలవల్లో స్నేహితులతో క్రికెట్ కోచింగ్, స్విమ్మింగ్‌లాంటి వాటికి వెళ్ళడానికి సమయానికి అన్నీ అమర్చిపెట్టే అమ్మ లేకపోతే ఇబ్బందవుతుందనీ గొడవ చేస్తే ఊహ తెలిసిన దగ్గరనుంచీ మా కోసం అమ్మ ఎన్నోసార్లు తమ ఊరికి పెట్టుకున్న ప్రయాణాన్ని ఆఖరి క్షణంలో మానుకోవడం నాకు బాగా గుర్తుంది. అమ్మ మా మీద ప్రేమతో వుండిపోయిందనుకునే వాళ్ళం. కానీ అందువల్ల తను కోల్పోయిందేమిటో తెలుసుకోలేక పోయాం.

తిరుగు ప్రయాణంలో అమ్మ ముఖంలో ఏదో చెప్పలేని సంతృప్తి... సంతోషం! మేము పరీక్షలు పాసయినప్పుడూ, నాన్నకి ప్రమోషన్లు వచ్చినప్పుడూ ఇంకా చాలా చాలా సందర్భాల్లో అమ్మ ముఖంలో నేను గతంలో ఎన్నోసార్లు సంతోషాన్ని చూసాను... కానీ ఇలాంటి సంతోషాన్ని మాత్రం అంతకు ముందెన్నడూ చూడలేదు!

ఆ తరువాత అమ్మ తమ ఊరికి ఎప్పుడు ప్రయాణం పెట్టుకున్నా సపోర్ట్ చేస్తూ నాన్నతో దెబ్బలాడి మరీ పంపించడంలో నేనే ముందుండే వాడిని!!

*